RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 158 | మే 17, 2025 | వెల : రూ.3-00



రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

4లో..

# ఇంతింతై వటుడింతై..





## గురువును మించిన శిష్యులు!

- రాజకీయాల్లో తమదైన మార్క్ చూపిన లీడర్లు
- ప్రత్యర్థిగా తలపడి పై చేయి సాధించిన వారు కొందరు
- ఓనమాలు నేర్పిన మెంటార్స్ కంటే ఉన్నత, సమాన స్థాయిలో మరికొందరు..
- రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, ఏక్‌నాథ్ షిండేతో పాటు పలువురు ప్రముఖ నేతలు

**వేద న్యూస్, అంబీర్ శ్రీకాంత్ :**

*గురువు లేని విద్య గుడ్డి విద్యని, ప్రతి విషయంలో గురువు మార్గదర్శనం ఉంటే తప్పకుండా రాణించొచ్చని పెద్దలు చెప్తుంటారు. మరీ ముఖ్యంగా రాజకీయ రంగంలో రాణించాలంటే మెంటార్‌గా, గాడ్ ఫాదర్‌గా ఒకరు ఉంటే.. వారి గైడెన్స్‌తో తక్కువ సమయంలో ఉన్నతస్థాయికి వెళ్లే అవకాశాలు ఉంటాయి. అయితే, రాజకీయ ఓనమాలు నేర్పిన గురువుల కంటే ఉన్నతస్థాయిలో పాలిటిక్స్‌లో రాణించిన శిష్యులున్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో గురువుకు ఎదురునిలిచి ప్రత్యర్థిగా తలపడి గెలిచి రాజకీయాల్లో పైచేయి సాధించిన సందర్భాలూ రాజకీయాల్లో గమనించొచ్చు. ప్రజాక్షేత్రంలో తమదైన ముద్రవేసి.. అలా గురువును మించిన శిష్యులుగా రాజకీయాల్లో రాణిస్తున్న కొందరు లీడర్లపై 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక అందిస్తున్న స్పెషల్ స్టోరీ...*

### రేవంత్‌రెడ్డి



స్థానిక సంస్థల నుంచి ప్రజాప్రతినిధిగా ఎన్నికై ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన నాయకుడు ఎనుముల రేవంత్‌రెడ్డి. జెడ్పీటీసీ సభ్యుడిగా, శాసనమండలి సభ్యుడిగా, లోక్‌సభ సభ్యుడిగా పని చేసిన రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎదిగారు. స్వతం త్ర అభ్యర్థిగా జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికైన రేవంత్.. ఇండిపెండెంట్ ఎమ్మెల్సీగా స్థానిక సంస్థల నుంచి ఎలక్టయ్యారు. అనంతరం టీడీపీలో చేరిన రేవంత్‌రెడ్డి.. సుదీర్ఘకాలం ఆ పార్టీలో రకరకాల పద వుల్లో పని చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా టీడీపీ తరఫున కొడంగల్ నుంచి గెలిచిన ఆయ న.. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరా రు. అయితే, ఇతర రాజకీయ నాయకుల మాదిరిగా ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీకి



అంబీర్ శ్రీకాంత్

మిగతా 4వ పేజీలో..




# నైరుతి పలకరించింది

- ముందస్తుగా ప్రారంభమైన వర్షాలు
- జిల్లాలో ఇప్పటికే సాగుకు సిద్ధమైన రైతులు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

నిన్నటి వరకు జిల్లాల్లో మండుతున్న ఎండతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎప్పుడు ఎప్పుడు అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రానే రావడంతో జిల్లాల్లో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో తొలకరి వానలు మొదలయ్యాయి. దీంతో రైతులు భూములను దుక్కి దున్నడం మొదలుపెట్టారు. అంతేకాకుండా జిల్లాల్లో కొన్ని గ్రామాలలో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. నైరుతి రుతుపవనాలు రావడంతో రైతులు హడావుడి మొదలైంది. వేములపల్లి,మాడుగులపల్లి,తిప్పర్తి త్రిపురారం మండలాల్లో పత్తి సాగును ఎక్కువగా పండిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు పత్తి విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. కొంతమంది రైతులు విత్తనాల కోసం పెస్టిసైడ్ షాప్ ల వద్ద కోలాహలంగా మారింది. ఇప్పటివరకు భానుడు ప్రతాపంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. నేడు వర్షంతో భూమి చల్లబడడంతో ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. జూన్ నెల ఆరంభంలో కురవాల్సిన తొలకరి వానలు మే నెలలోనే నైరుతి రుతుపవనాలు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పింది. దీంతో జిల్లాల్లో రైతులు ఆనందంలో మునిగిపోతున్నారు.




# త్వరితగతిన లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయండి


- కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

త్వరితగతిన లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పురోగతిపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా పూర్తి చేయుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన, ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అనంతరం బ్యాంకులకు లోన్ పరిశీలన నిమిత్తం పంపించడం జరుగుతుందని అట్టి పరిశీలన తదుపరి



కమిటీ ఆధ్వర్యంలో సెలక్షన్ లిస్ట్ తయారుచేసి అట్టి జాబితాను కలెక్టర్‌కు మంజూరు కోసం పంపించడం జరుగుతుందని ఇట్టి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి సూచించిన గడువు లోగా పంపాలని అన్నారు. బల్దియా పరిధి 66 డివిజన్ల నుండి ఎస్సి, ఎస్టి బిసి, మైనారిటీ కార్పొరేషన్లకు సంబంధించి 36 వేల దరఖాస్తులు రావడం జరిగిందని, ఇందులో 30 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయడం జరిగిందని, మిగతా దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, నోడల్ అధికారులు ఆలివేలు, రాజేశ్వర్, ఎల్ డి ఏం రాజు, డిప్యూటీ కమిషనర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.




# పోలీసుల శ్రమదానం

- రోడ్డుకు ఇరువైపులా చెట్లు తొలగింపు

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం పరిధిలోని మాందారిపేట నుండి గట్ల కనిపర్తి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్లను శుక్రవారం ఎస్ఐ జక్కుల పరమేశ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి శ్రమదానం చేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండాలని ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# విరగ పూసిన మే పుష్పం

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బడంగ్ పేట సీతా హెూమ్స్ లో నివసిస్తున్న డిఫెన్స్ ల్యాబ్ స్కూల్ విశ్రాంతి తెలుగు ఉపాధ్యాయులు, అక్కినేపల్లి రమా వెంకటేశ్వరరావు ఇంట్లో మే పుష్పం విరగబోసి అందాలు ఆరబోస్తోంది. ఈ సందర్భంగా అక్కినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేవలం మే మాసంలో మాత్రమే ఈ పువ్వు పూసి వికసిస్తుందని తెలిపారు.

# నా వ్యాఖ్యలు వక్రీకరించారు

**వేద న్యూస్ డెస్క్**



ఫైళ్ల క్లియరెన్స్ కోసం మంత్రులు డబ్బులు వసూలు చేస్తారని.. కానీ తాను అలా చేయను అంటూ తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. మంత్రులపై ఆమె చేసిన వ్యాఖ్యలు గందరగోళానికి దారి తీశాయి. అయితే ఈ కామెంట్స్‌పై మరోసారి స్పందించారు మంత్రి కొండా సురేఖ. 'నా వ్యాఖ్యలను పూర్తిగా వక్రీకరించారు. మంత్రులు కమిషన్ తీసుకుంటారని కామన్‌గా చెప్పాను. బీఆర్ఎస్ పెయిడ్ వాళ్ళు కావాలని దీన్ని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు కమిషన్ తీసుకొని పనులు చేశారు. గత బీఆర్ఎస్ పార్టీలో మంత్రులుగా పనిచేసిన వాళ్ళు సెల్ఫ్ ఎంక్వైరీ చేయించుకోండి. మంత్రి కాకముందు మీ ఆస్తులు ఎంత ఇప్పుడు మీ ఆస్తులు ఎంత పెరిగిందో ఎంక్వయిరీ చేయించండి. నిజాలు బయటకు వస్తాయి' అని అన్నారు. గోరంతలు కొండంతలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పూర్తి వీడియోలు ప్రసారం చేయకుండా ఎడిటింగ్‌తో తప్పుడు ప్రచారాలు చేసి బద్నాం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను మాట్లాడిన దాంట్లో ముందు వెనక కట్ చేసి చిన్న క్లిప్‌ను కావాలని ట్రోల్ చేస్తున్నారన్నారు. కేబినెట్ మంత్రుల మధ్య గొడవలు పెట్టాలని కొందరు కుట్ర చేస్తున్నారని.. పని చేస్తున్న మంత్రులపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలను పేదలకు అందాలని మాత్రమే సర్కార్ చూస్తోందన్నారు. పారదర్శకంగా ప్రభుత్వం నడుపుతుంటే కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ పరిస్థితులు తయారు చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమని విమర్శించారు.

# రహదారిపై అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి..!

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ పట్టణంలో కొన్నిచోట్ల పురవీధులు ఇరుకుగా ఉంటాయి.పాతకాలం నాటి వార్డులు కావడం వలన కొన్ని చోట్ల రహదారులు ఇరుకుగా ఉంటాయి. అలాంటి రహదారులను కూడా ఒక ప్రబుద్ధుడు ఆక్రమించి అక్రమ నిర్మాణాలను జరుపుతుండడం దారుణం అని స్థానికులు వాపోతున్నారు.ఇలాంటి సంఘటన మిర్యాలగూడ పట్టణంలో జరుగుతుంది. పట్టణంలోని కలల్వాడలో సిమెంటు రహదారిని ఆక్రమించి మారం శ్రీనివాస్ అనే వ్యక్తి గదులు నిర్మిస్తున్నారని వీటిని అడ్డుకోవాలని కోరుతూ స్థానికులు మిర్యాలగూడ పురపాలకశాఖ కమిషనర్ యూసఫ్ కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా స్థానికుడు జైని శ్రీరామ్మోహన్ రావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి వినియోగించిన సిమెంటు రహదారిని ఆక్రమించి నిర్మాణం చేపడుతుండగా స్థానికంగా నడిచి వెళ్లే వారికి,వాహనాలు నడిపే వారికి ఇబ్బంది కలుగుతుందన్నారు.గతంలో తాము ఫిర్యాదు చేయడంతో కొంతకాలం నిర్మాణం ఆపేశారని, మళ్లీ తిరిగి నిర్మాణం చేపడుతున్నారని అన్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు జోక్యం చేసుకొని నిర్మాణం నిలిపివేయాలని కోరారు. ఈ అక్రమ నిర్మాణ విషయంలో తాము జిల్లా కలెక్టర్ కు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.ఫిర్యాదు చేసినవారిలో గుండా రమేష్, వెంకటమ్మ, మదన్,దుర్గయ్య, రాంబాబు,లక్ష్మీ, శ్రీనివాస్,వెంకటేశ్వర్లు, పుష్పలత, కస్తూరమ్మ తదితరులు ఉన్నారు.

# అపరిశుభ్ర, ట్రేడ్ లైసెన్స్ లేకుండా హోటల్స్ నిర్వహణకు పెనాల్టీలు

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



అపరిశుభ్ర పరిస్థితుల్లో, ట్రేడ్ లైసెన్స్ లేకుండా హోటల్స్ నిర్వహణకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయానికి గాను మొత్తం రూ.62 వేలు జరిమానా విధించినట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజారెడ్డి తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగర పరిధి లోని పలు హోటళ్లు, రెస్టారెంట్ లు షాపులను శానిటేషన్ అధికారులు తనిఖీలు చేపట్టి అపరిశుభ్ర పరిస్థితుల్లో హోటల్ నడుపుతున్న 51 వ డివిజన్ పరిధి లోని ఎక్సైజ్ కాలనీ లో గల నాటుకోడి చిట్టి గారెలు హోటల్ కు రూ.30 వేలు ట్రేడ్ లైసెన్స్ లేకుండా రెస్టారెంట్ నిర్వహిస్తున్న హంటర్ రోడ్ లోని కడాయి రెస్టారెంట్కు రూ. 30 వేలు నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న వెంకట సాయి కిరాణా షాపు యజమానికి రూ.2 వేలు జరిమానా తో కలిపి మొత్తం గా రూ.62 వేల జరిమానా విధించినట్లు సి ఎం హెచ్ ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, సంపత్ రెడ్డి, నిరంజన్, అనిల్ ప్లాస్టిక్ ఎన్ఫోర్స్మెంట్ బృంద సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి వేడుకలో అపశృతి



**వేద న్యూస్, పార్వతీపురం/మన్యం జిల్లా :**

పాలకొండ మండలం బాసూరు గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామంలోని ఒక వివాహ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న వ్యక్తిని హార్ట్ స్ట్రోక్ రూపంలో మృత్యువు కబలించింది. గ్రామానికి చెందిన 36 ఏళ్ళ సుంకరి బంగారునాయుడు పెయింటర్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో జరిగిన శుభకార్యం ఊరేగింపులో గ్రామస్తులతో కలిసి నృత్యం చేస్తూ గుండె పోటుతో హఠాత్తుగా మరణించాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కళ్ళముందే ఉండే మనిషి కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో బాసూరు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# సెంట్రల్ లైటింగ్ నిర్వహణ పగడ్బందీగా జరగాలి

## - నగర మేయర్ గుండు సుధారాణి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వీధి దీపాలు సెంట్రల్ లైటింగ్ నిర్వహణ పగడ్బందీగా జరగాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యల్లో భాగంగా నగరంలో లైటింగ్ నిర్వహణ లో బ్లాక్ స్పాట్ ల గుర్తింపు తో పాటు అందుకు అవసరమైన సామాగ్రి పరికరాలను కొనుగోలు చేయాలని నగర వ్యాప్తంగా ఉన్న 83750 వీధి దీపాలన్ని సక్రమంగా పనిచేసేలా చూడాలని, ప్రధానంగా విలీన గ్రామాల్లో అంధకారం లేకుండా వీధి దీపాలు వెలిగేలా చూడాలని మేయర్ అన్నారు. నీటి సరఫరా తీరును సమీక్షించిన మేయర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి చివరి పాయింట్ వరకు నీటి సరఫరా జరిగేలా చూడాలని ఎప్పటికప్పుడు లీకేజీ లను అరికట్టాలని నీరు అందని చివరి ఏరియాలకు నీటి సమస్యలు ఉన్న ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ ల ద్వారా నీటి సరఫరా జరగాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాస్, ఈఈ లు రవికుమార్, సంతోష్ బాబు, మాధవి లత, డిఈ కార్తీక్ రెడ్డి, ఏఈ సరిత తదితరులు పాల్గొన్నారు.

# నేనే మధ్యవర్తిత్వం చేశా..



**వేద న్యూస్, డెస్క్:**

భారత్ – పాకిస్తాన్‌ల మధ్య మధ్యవర్తిత్వం చేసి కాల్పుల విరమణకు ఒప్పించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చెప్పారు. గురువారం ఖతార్‌లోని సైనిక స్థావరంలో అమెరికా దళాలతో ట్రంప్ మాట్లాడుతూ అమెరికా దౌత్యపరంగా జోక్యం చేసుకునే ముందు భారత్ – పాకిస్తాన్ మధ్య పరిస్థితి ప్రమాదకరమైన స్థాయికి చేరుకుందని అన్నారు. ‘నేను అలా చేశానని చెప్పుకోదలచుకోలేదు. కానీ, గతవారం భారత్ – పాకిస్తాన్ మధ్య సమస్యను పరిష్కరించడానికి నేను ఖచ్చితంగా సహాయం చేశాను’ అని ట్రంప్ తెలిపారు. యుద్ధానికి బదులుగా వాణిజ్యం చేద్దామని ఇరు దేశాలకు చెప్పానని, ఇరు దేశాలతో వాణిజ్యం గురించి మాట్లాడానని తెలిపారు. తన మాటలకు భారత్, పాకిస్తాన్ సంతోషంగా ఉన్నాయని, ప్రస్తుతం ఇరుదేశాల మధ్య పరిస్థితి స్థిరంగా ఉందని ట్రంప్ చెప్పారు. భారత్‌లో ఆపిల్ కంపెనీ కార్యకలాపాల విస్తరణపై కూడా ట్రంప్ అక్కసు వెళ్లగక్కారు. ఇండియాలో ఐఫోన్ల తయారీ సామర్థ్యాన్ని పెంచకూడదని ఆ కంపెనీ సిఇఒ టిమ్ కుక్‌ను ఆదేశించారు. తాను చెబితేనే భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగిందని ట్రంప్ పునరుద్ఘాటించారు. కాల్పులు నిలిపివేయకుంటే రెండు దేశాలతో వాణిజ్యాన్ని నిలిపివేస్తామని హెచ్చరించామన్నారు. దీంతో ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని చెప్పారు.

# అమెజాన్, ఫ్లిప్ కార్ట్ లో పాకిస్థాన్ జెండాల అమ్మకం... కేంద్రం ఆగ్రహం

**వేద న్యూస్, డెస్క్ :**

భారతదేశంలోని ప్రముఖ ఈ-కామర్స్ వేదికలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సహా పలు సంస్థలు పాకిస్తాన్ జాతీయ జెండాలు, సంబంధిత వస్తువులను విక్రయిస్తున్నాయన్న ఆరోపణలపై కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) తీవ్రంగా స్పందించింది. ఇవి జాతీయ మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొంటూ, సదరు సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ఈ ఉత్పత్తులను తక్షణమే తమ ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అమెజాన్ ఇండియా, ఫ్లిప్‌కార్ట్, యుబై ఇండియా, ఎట్సీ, ది ఫ్లాగ్ కంపెనీ, ది ఫ్లాగ్ కార్పొరేషన్ వంటి ఈ-కామర్స్ సంస్థలకు సీసీపీఏ నోటీసులు పంపినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. పాకిస్థాన్‌కు చెందిన జెండాలు, ఇతర వస్తువులను ఈ-కామర్స్ వేదికలపై విక్రయించడం జాతీయ మనోభావాలను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. "ఇటువంటి సున్నితత్వ లోపాలను సహించబోము. ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు తక్షణమే అటువంటి కంటెంట్‌ను తొలగించి, జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలి" అని మంత్రి ప్రహ్లాద్ జోషి తన పోస్టులో స్పష్టం చేశారు.

అంతకుముందు, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) ఈ విషయంపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, ప్రహ్లాద్ జోషిలకు లేఖ రాసింది. భారతదేశంలో పనిచేస్తున్న ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై పాకిస్థానీ జెండాలు, ఇతర వస్తువుల అమ్మకాలను నిషేధించాలని ఆ లేఖలో కోరింది. పాకిస్థాన్ జాతీయ చిహ్నాలతో కూడిన జెండాలు, ఇతర వస్తువులు ఈ ప్లాట్‌ఫామ్‌లలో కొనుగోలుకు అందుబాటులో ఉన్నాయని సీఏఐటీ తన లేఖలో పేర్కొంది.

సీఏఐటీ జాతీయ అధ్యక్షుడు బీసీ భారతీయ, మంత్రి గోయల్‌కు రాసిన లేఖలో, "మన జాతీయ మనోభావాలు, సార్వభౌమాధికారం దెబ్బతినేలా ఉన్న ఒక విషయంపై నా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాను. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రధాన ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై పాకిస్థానీ జెండాలు, లోగోలతో కూడిన మగ్గులు, టీ-షర్టులు బహిరంగంగా అమ్ముడవుతున్న విషయం వెలుగులోకి వచ్చింది" అని తెలిపారు. "పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా మన వీర సాయుధ దళాలు అత్యంత కీలకమైన జాతీయ ప్రాముఖ్యత కలిగిన 'ఆపరేషన్ సిందూర్'లో చురుకుగా పాల్గొంటున్న తరుణంలో ఈ కలవరపరిచే పరిస్థితి నెలకొంది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# హిందూ మహాసముద్రంలో అనూహ్య పరిణామం!

**వేద న్యూస్, డెస్క్:**

పాకిస్థాన్‌తో పాటు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత బలగాలు నిర్వహించినట్లుగా భావిస్తున్న 'ఆపరేషన్ సిందూర్' తర్వాత హిందూ మహాసముద్రంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. చైనాకు చెందిన 'డ యాంగ్ యి హావో' అనే గూఢచారి నౌక భారత జలాల సమీపంలో సంచరించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామం పాకిస్తాన్–చైనా మధ్య ఉన్న బలమైన బంధాన్ని సూచిస్తోందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

'ఆపరేషన్ సిందూర్' జరిగిన వెంటనే చైనా నౌక భారత సముద్ర జలాలకు దగ్గరగా రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. సముద్ర గర్భంలో భారత నౌకల కదలికలు, మన నిఘా వ్యవస్థల పనితీరు, ప్రతిస్పందన సామర్థ్యం, ముఖ్యంగా జలాంతర్గాముల కదలికలను పసిగట్టేందుకు చైనా ఈ నౌకను పంపి ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఈ నౌకలో అత్యాధునిక హైడ్రోగ్రాఫిక్ పరికరాలు, సెన్సర్లు ఉన్నాయని, వీటి ద్వారా ఐఎన్ఎస్ విక్రాంత్‌తో సహా ఇతర భారత యుద్ధ నౌకల కదలికలను సులువుగా తెలుసుకునే అవకాశం ఉందని ఆ వర్గాలు చెబుతున్నాయి.

# సంపాదకీయం

**అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో అన్యాయం**

తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం అభినందించ దగ్గ విషయం. గత దశాబ్ది తెలంగాణలో విద్యావ్యవస్థ అభివృద్ధికి అనేక పరిమి తులు ఏర్పడ్డాయి. ప్రాథ మిక విద్య మొదలు ఉన్నత విద్యవరకు గత ప్రభుత్వం సరైన దృష్టి సారించలేదన్న విషయాన్ని గత ప్రభుత్వాన్ని గద్దె దించి తెలంగాణ సమాజం అర్థం చేయించింది. ఏ సమాజంలో నైనా విద్య మొదటి ప్రాధాన్యత అవ్వాలి. కానీ, మన రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. కర్ణుని చావుకి సవాలక్ష కారణాలంటూ దీనికి అనేక కారణాలు న్నాయి.కానీ, వర్తమాన సమాజం ఈ పరిస్థితి మారాలని కోరుకుం టున్నది. ప్రపంచీకరణ ప్రభావం, పెట్టుబడి ప్రవాహం వల్ల విద్య ప్రాథమిక హక్కుగా, నైతిక బాధ్యతగా గుర్తించ బడటం లేదు. కేవలం ఒక పారిశ్రామిక రంగంగా తయారైంది. తెలంగాణ రాజధానిగా, మిని ఇండియాగా పిలవబడుతున్న హైదరాబాద్‌లో ఉన్నత విద్య ముఖ్యంగా ప్రయివేటు రంగం చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యపై దృష్టిని కేంద్రీకరించడం లేదు. గత మూడు దశాబ్దాలుగా నెలకొన్న రాజకీయ, ఆర్థిక కారణాల వల్ల దేశవ్యాప్తంగా ఒక అసమ సమాజం ఏర్పడింది. దీనివల్ల పేద, మధ్య తరగతి వర్గాలకు నాణ్యమైన విద్య దూరమైంది, ఈ పరిస్థితి మారాలి. రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ పరిధిలోని పన్నెండు విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విధి, విధానాలను 4ఏప్రిల్ 2025 జీవో నెంబర్21 ద్వారా ఖరారు చేసింది. ఇది నియ మించిన ఉన్నతస్థాయి కమిటీ ఈ సిఫారసులను చేసినట్లు, వాటిని ఆమోదించినట్లు ప్రకటిం చింది. నిజానికి ఈ విశ్వవిద్యాలయాల్లో గత ఇరవైయేండ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైమ్ అధ్యాపకుల స్థానాన్ని నిర్ధారించకుండా రిక్రూట్‌మెంట్ ప్రస్తావన తీసుకురావడం ద్వారా గత నెలరోజులుగా వివిధ రూపాల్లో నిరసన వ్యక్తమ వుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక జీవో 21ని క్షుణ్ణంగా పరిశీలిస్తే గనుక గతంలో ఉన్న నిబంధనల స్థానంలో మూడు దశల స్క్రూటినీ విధానాన్ని అనుసరిస్తూ విశ్వవిద్యాల యాలు ఖాళీలను భర్తీ చేయాలని ప్రతిపాదించింది. ఈ విధా నాలను ప్రతీ విశ్వవిద్యాలయం తమ పాలకమండలిలో ప్రవేశపెట్టి, ఆమోదించుకోవాల్సి ఉంటు ందని ఉన్నత విద్యామండలి సూచించింది. జీవో నెం. 21 అనుబంధం 1లో ఎ,బి,సి అనే విభజనల్లో స్క్రూటినీ విధా నాలను సూచించింది. ఈ మూడు దశల్లో అభ్యర్థి విషయ పరి జ్ఞానం, సబ్జెక్ట్ ప్రెజెంటేషన్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, వ్యక్తిత్వాల ఆధా రంగా మార్కులు కేటాయిస్తుంది. ఇది మా ర్కుల విభజన, స్క్రూటినీ విధా నం. ఇది సహజ న్యాయానికి, యూజీసీ నిబంధనలకు పూర్తి విరుద్ధం. ఉన్నత విద్యామండలి ప్రతిపాదించిన స్క్రూటినింగ్ విధా నాలను లోతుగా గమనిస్తే అనేక లోటు పాట్లు ఉన్నాయనే విషయం అర్థమవు తున్నది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి సంబం ధించి ఇప్పటివరకు రెండు దశల స్క్రూటినీ పద్ధతినే పాటిస్తున్నారు. మొదటి దశలో ఎపిఐ స్కోర్ వంద మార్కులు, ఇంటర్వ్యూ, ప్రజం టేషన్‌కి యాభై మార్కులను కేటాయి స్తారు. ఈ పద్ధతినే చాలా వరకు కేంద్రీయ విశ్వ విద్యాల యాలు అనుసరిస్తున్నాయి. కానీ, తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రతిపాదిత కమిటీ రూపొం దించిన ఈ జీవోలో ఈ పద్ధతిని మార్చారు. స్క్రూటినింగ్ విధానాన్ని మూడు దశలకు పెంచి, ఎ- 50, బి - 30, సి - 20 అని మార్కులకు పరిమితం చేస్తూ, మిగతా వాటితో కలపకుండా వాటిని కట్టడి చేశారు. ఇది అనాలోచిత నిర్ణయం. ఇక ప్రతిపాదిత 'ఎ' దశలో పీహెచ్‌డీకి పది మార్కులు మాత్రమే కేటాయిం చారు. నిజానికి దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు అసిస్టెంట్ ప్రొఫె సర్ల నియామకాల్లో 25 నుండి 30 మార్కులను కేటాయిస్తున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే అత్యున్నత డిగ్రీగా పేరు ఉన్న పీహెచ్‌డీ కన్నా, పీజీకి మార్కులు అధికంగా కేటాయించారు. ఇదెక్కడి విధానమో జీవో రూపకర్తలకే తెలియాలి.అలాగే బోధనాను భవానికి ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా పది మార్కులిస్తున్నారు. అలాగేపోస్ట్ డాక్టోరల్, రీసెర్చ్ అసోసియేట్ షిప్‌లకి సంబంధించి ఐదు మార్కులు వేస్తున్నారు.ఇందులో అభ్యర్థి ముప్తై మార్కుల్లో సాధిం చిన మార్కుల ఆధారంగానే ప్రతి పాదిత సి దశలోకి 1:5 పద్ధతిలో ఎంపిక చేస్తామని ప్రకటించారు. దీనివల్ల నూత నంగా పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న అభ్యర్థులు బోధన, పరిశోధా నుభవం విష యంలో తీవ్రంగా నష్ట పోతున్నారు. స్క్రూటినీ అనేది అభ్యర్థి మెరిట్ ఆధారంగా జర గాలి కానీ, ఇందులో అనుభవం పేరుతో స్క్రూటినీ జరుగుతుంది. ఇది సహజ న్యాయ సూత్రానికి వ్యతిరేకం. అలాగే ఎటువంటి వివక్షత చూపకుండా సమాన అవకాశాలు కల్పించే భారత రాజ్యాంగం ఆర్టికల్ 16కి ఈజీవో పూర్తి విరుద్ధం. ముప్తై మార్కుల్లో నూత నంగా పీహెచ్‌డీ పూర్తి చేసు కున్న అభ్యర్థి సహజంగానే పదిహేను మార్కులు కోల్పో తాడు. సగం మార్కులు కోల్పోయిన తర్వాత మిగతా పదిహేను మార్కులకు పోటీ పడి తర్వాతి దశలోకి ఎలా వెళ్లగలరు? ఇంత స్పష్టంగా సమస్య అర్థమవు తుంది. అభ్యర్థి మెరిట్‌ను ప్రతి పాదిత స్థానానికి సూచించిన అర్హతల్లో చూడాలి కానీ, అనుభవం ఏనాటికీ మెరిట్ కాజాలదు. ఈ అభ్యంతరం పట్ల ఈ జీవో రూపకర్తలు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవ సరం ఉంది. అయినా విశ్వ విద్యాలయ స్థాయి అధ్యాపక స్థితికి మొదటి అడుగు (డోర్‌స్టెప్) అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థానా నికి ఎక్స్‌పీరియన్స్‌ని ప్రధానం చేసి, ఈ మార్కుల తోనే స్క్రూటినీ చేస్తామని చెప్పడం అప్రజాస్వామికం.

'బి' దశలోకి వచ్చిన అభ్యర్థి మెరిట్‌ని పరిగణలోకి తీసుకోకుండా "బోధనానుభవం, పరిశోధానుభవం" పేరుతో మార్కులను కేటా యించి, ఇంటర్వ్యూ దశలోకి పంపుతున్నారు. దీనివల్ల బోధన, పరిశోధనలపై మక్కువతో ఉన్న నూతన అభ్యర్థులకు ఉన్నత విద్యామండలి ప్రతిపాదించిన విధి, విధానాలే అడ్డంకిగా మారు తున్నాయి. వీరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కి అనర్హులని నూటికి నూరు శాతం ప్రకటిస్తు న్నాయి. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల బోధనానుభవాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదు. విచిత్రమేమిటంటే యూని వర్సిటీ పరిధిలోని ప్రయివేటు కళాశాలల్లో పని చేస్తున్న వారికి సర్వీసును అంగీకరిస్తూ, మాతృ విశ్వవిద్యాల యాల్లో బోధన చేస్తున్నవారికి సర్వీసును పరిగణలోకి తీసుకోకపో వడం. వర్సిటీ పరీక్ష పెట్టి, ఇంటర్వ్యూ చేసి పార్ట్ టైమ్ బోధకులను ఎంపిక చేసింది. యూని వర్సిటీలు అధ్యాపకులను ఎంపిక చేసిన ఈ విధానం మంచిది కాదా? తనని తానే దోషి అని పిలుచు కుంటుం దా? అనే విషయాలను తేల్చాల్సిన అవసరం ఉంది. అలాగే ఈ జీవోలో ప్రస్తావిం చిన 'ఎ' దశ స్క్రూటినీ విధానం ఆబ్జెక్టివిటీకి దగ్గరగా ఉంది. కానీ, బి, సి దశల్లో కేటాయించిన మార్కుల విషయం లో సబ్జెక్టివిటీ చోటుచేసుకునే అవకాశం ఎక్కువగా ఉంది. ఉన్నత విద్యా సంస్థల్లో బాధ్యతాయుతమైన అసిస్టెంట్ ప్రొఫె సర్ల నియామ కం పారదర్శకంగా, న్యాయంగా జరగాలంటే ఈ జీవోలోని అంశాల ను మరింత పారదర్శకంగా తయారు చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే సమాజం కోరుకుం టున్న బాధ్యతాయుతమైన, సుశిక్షిత, ప్రతిభా వంతమైన అభ్యర్థులు బోధకులుగా మారే అవ కాశం ఉంటుంది. కనుక ఇలాంటి అప్రజాస్వామిక, సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా ఉన్న మూడు దశల స్క్రీనింగ్ విధానాన్ని, ఇతర అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని, మెరిట్ ఆధారంగా స్క్రూటినీ విధానాలను రూపొందిం చాలి. జీవో నెంబర్ 21ని వెనక్కి తీసుకోవాలి. తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ప్రాతిపదికను తయారు చేయాలి.

# అణగారిన వర్గాలకు భయపడే కులగణనకు ప్రధాని అంగీకారం

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



దేశంలో అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే భయంతోనే ప్రధాని మోడీ కులగణనకు అంగీకరించారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాల తరపున పోరాడుతున్న ప్రతిపక్షానికి ప్రధాని భయపడ్డారని అన్నారు. బీహార్‌లోని దర్బంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా యూనివర్సిటీ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తాను ఇక్కడికి రాకుండా అడ్డుకునేందుకు స్థానిక నేతలు, అధికారులు ఎంతో ప్రయత్నించారని అన్నారు. అన్ని అడ్డంకుల్నీ అధిగమించి వచ్చానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో బీహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీహార్‌లో యువతతో మమేకమయ్యేందుకు తలపెట్టిన 'శిక్షా న్యాయ సంవాద్' కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికారపార్టీ నాయకులు, అధికారులు ఎంతో ప్రయత్నించారు. యూనివర్సిటీ గేటు బయటే నా కారును నిలిపివేశారు. బీహార్ ప్రభుత్వం నన్ను ఎందుకు ఆపలేకపోయిందో తెలుసా? మీ అందరి అభిమానమే నన్ను ముందుకు నడిపించింది. ఇదే శక్తి నరేంద్ర మోడీని గద్దె దించుతుంది. ప్రతిపక్షాల డిమాండ్ మేరకే కులగణను మోడీ అంగీకరించారు. ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసు" అని అన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అంబానీ, అదానీల కోసమే పని చేస్తోందని రాహుల్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో చేపట్టిన విధంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, ప్రయివేటు కళాశాలలు, యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడలు వంచైనా వీటిని సాకారం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

# ఆస్తి కోసం తల్లి అంత్యక్రియలను అడ్డుకున్న చిన్న కొడుకు

**వేద న్యూస్, డెస్క్:**



కని పెంచి పెద్ద చేసిన తల్లి అంతిమ సంస్కారాలు ఘనంగా నిర్వహించాల్సిన కన్న కొడుకు ఆస్తి కోసం తల్లి అంతిమ సంస్కారలను అడ్డుకున్నాడు. ఈ ఘటన రాజస్థాన్ లో జైపూర్ సమీపంలో విరాట్ నగర్ ప్రాంతంలో ఈనెల 3న చోటుచేసుకుంది. కాగా ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. వివరాలలోకి వెళితే.. విరాట్ నగర్ ప్రాంతానికి చెందిన మహిళ (80) అనారోగ్యంతో మృతి చెందింది.ఇప్పటి వరకు ఆమె బాధ్యతలు పెద్ద కొడుకు చూసుకున్నాడు. అయితే కుటుంబ పెద్దలు ఆమె శరీరంపై ఉన్న వెండి గాజులు, ఇతర బంగారు ఆభరణాలు పెద్ద కొడుకుకి అప్పగించారు. తల్లి ఆభరణాలలో తనకు వాటా ఇవ్వాలని చిన్న కుమారుడు పట్టుబట్టాడు. తనకు ఆభరణాల్లో వాటా ఇచ్చాకే తల్లి అంత్యక్రయలు నిర్వహించాలని లేకపోతే తల్లితో పాటు తనను చితిలో కాల్చి వేయండి అంటూ చితిపై పడుకొని బీభత్సం సృష్టించాడు. చివరకు ఆభరణాలు అతడికి ఇవ్వడంతో తల్లికి పెద్ద కొడుకు అంత్యక్రియలు నిర్వహించాడు.ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# సింధు జలాల ఒప్పందాన్ని సమీక్షిద్దాం

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



పహల్గాం ఉగ్రదాడులతో సింధు నదీ జలాల ఒప్పందాన్ని (ఐడబ్ల్యుటి) భారత్ నిలిపివేసిన నేపథ్యంలో దానిపై చర్చలు ప్రారంభించేందుకు, ఒప్పం దాన్ని సమీక్షించేందుకు సిద్ధంగా వున్నట్లు పాకిస్తాన్ తెలియజేసింది. ఈ మేరకు పాక్ జలవనరుల శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా నుండి భారత్ జల వనరుల శాఖ కార్యదర్శి దేవశ్రీ ముఖర్జీకి వారం రోజుల క్రితమే ఒక లేఖ అందిందని అధికార వర్గాలు తెలిపాయి. పాకిస్తాన్‌కు చెందిన సింధు జలాల కమిషనర్‌తో చర్చలు జరిపేందుకు ఒక ప్రతినిధిని నియమిం చాల్సిందిగా ఆ లేఖలో కోరారు. కచ్చితంగా ఏ రోజున ఈ లేఖ పంపారనే విషయం వెల్లడించడానికి ఆ వర్గాలు నిరాకరించాయి. జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఈ ఉత్తరం పంపినట్లు ఆ వర్గాలు తెలిపాయి. దీనిపై వ్యాఖ్యానించడానికి భారత విదేశాంగ శాఖ నిరాకరించింది. సింధుజలాల ఒప్పందంపై తిరిగి ఇరు దేశాల ప్రభుత్వాలు చర్చలు జరపాలన్నది భారత్ వైఖరిగా వుంది. అవి జరిగేవరకు శాశ్వత సింధు కమిషన్ (పిఐసి) సమావేశాలేవీ జరగబోవని భారత్ గత సెప్టెంబరులోనే చెప్పింది. 2023 జనవరి నుండి భారత్ నాలుగుసార్లు పాకిస్తాన్‌కు లేఖ రాసింది, ఒప్పందాన్ని సవరించడంపై చర్చలు ప్రారంభించాలని కోరింది. పాకిస్తాన్ నుండి సంతృప్తికరమైన సమాధానం రాలేదు. తాజా పరిస్థితుల్లో సమావేశం కావడానికి, అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించడానికి సుముఖంగా వున్నట్లు పాక్ పేర్కొంటోంది.

# అటవీ భూముల స్థితిగతుల పరిశీలనకు సిట్‌లు ఏర్పాటు చేయండి

**వేద న్యూస్, డెస్క్:**



రిజర్వ్ అటవీ భూములను అటవీయేతర ప్రయోజనాల కోసం కేటాయించినట్లైతే వాటి స్థితిగతులను పరిశీలించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు గురువారం రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. అటువంటి భూములను ఎవరైనా తీసుకుంటే వాటిని వెనక్కు ఇచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని, తిరిగి వాటిని అటవీ శాఖకు అప్పగించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవారు, జస్టిస్ అగస్టిన్‌జార్జి, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన బెంచ్ రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఆ భూమిని వెనక్కి తీసుకోవడం విస్తృత ప్రజా ప్రయోజనాల రీత్యా సరిపోదని భావించినట్లైతే ఆ భూమికైన వ్యయాన్ని ఎవరికైతే కేటాయించారో ఆయా వ్యక్తులు లేదా సంస్థల నుండి వసూలు చేయాలని బెంచ్ కోరింది. ఈ రోజు నుండి ఏడాదిలోగా అటువంటి బదిలీలన్నీ జరిగేలా చూసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులను, కేంద్ర పాలిత ప్రాంతాల అడ్మినిస్ట్రేటర్లను ఆదేశించింది. పూనేలో రిజర్వ్ అటవీ భూమికి సంబంధించిన కేసులో తీర్పు సందర్భంగా సుప్రీం ఈ ఆదేశాలు జారీ చేసింది. విలువైన అటవీ భూములను వాణిజ్య ప్రయోజనాలకు మార్చే ప్రక్రియలో రాజకీయ నేతలు, అధికారులు, బిల్డర్ల మధ్య గల సంబంధాలకు ప్రస్తుత అంశం చక్కని ఉదాహరణ అని బెంచ్ వ్యాఖ్యానించింది.




# జులై 9కి సార్వత్రిక సమ్మె వాయిదా

**వేద న్యూస్, డెస్క్:**

ఈ నెల 20న జరగాల్సిన కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె జులై 9 నాటికి వాయిదా పడింది. గురువారం నాడిక్కడ కేంద్ర కార్మిక సంఘాల నేతలు సమావేశమయ్యారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 20న జరగాల్సిన సార్వత్రిక సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశం ఇంత తీవ్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ, లేబర్ కోడ్‌ల అమలును దూకుడుగా ముందుకు తీసుకెళ్తోందని విమర్శించారు. కార్మికుల పని గంటలను పెంచుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల హక్కులను కాలరాస్తోందని కేంద్ర కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. జులై 9న సార్వత్రిక సమ్మెను నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దీనిపై యజమానులు, అధికారులకు అవసరమైన సమాచారం అందజేయాలని సూచించారు. ఈ నెల 20న పని ప్రదేశం, స్థానిక, జిల్లా స్థాయిల్లో సమీకరణలు జరగాలని తెలిపారు. ప్రజల్లో సమ్మె ప్రచారాలను కొనసాగించాలని పేర్కొన్నారు. జులై 9వ తేదీన సమ్మెను జయప్రదం చేసేందుకు సమాయత్తం కావాలని కేంద్ర కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు.

# టిఎఎస్‌ఎంఎసిలో మనీలాండరింగ్ కేసులో ఈడి సోదాలు




**వేద న్యూస్, డెస్క్:**

తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పోరేషన్ (టిఎఎస్‌ఎంఎసి)తో ముడిపడిన మనీలాండరింగ్ కేసు(పిఎంఎల్‌ఎ)కి సంబంధించి ఈడి శుక్రవారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా మరోసారి సోదాలు చేపట్టింది. పిఎంఎల్‌ఎ కింద 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు ఈడి అధికారులు తెలిపారు. మార్చిలో ఈడి మొదటిసారి దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో టిఎఎస్‌ఎంఎసి కార్యకలాపాల్లో పలు అవతవకలను గుర్తించినట్లు వెల్లడించింది. టెండర్లను తారుమారు చేసిందని, మద్యం కంపెనీల ద్వారా రూ.వెయ్యికోట్ల విలువైన 'లెక్కల్లో చూపని' నగదు లావాదేవీలు జరిపినట్లు తెలిపింది. టిఎఎస్‌ఎంఎసి ఉద్యోగులు, డిస్టిలరీల కార్పోరేట్ కార్యాలయాలు మరియు ప్లాంట్లపై దాడి చేసిన తర్వాత అవినీతికి సంబంధించిన ఆధారాలు లభ్యమయ్యాయని ఈడి ఒక ప్రకటనలో తెలిపింది. టిఎఎస్‌ఎంఎసి రవాణా టెండర్ కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని, దరఖాస్తుదారు కెవైసి వివరాలు మరియు డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి)ల మధ్య పొంతనలేదని పేర్కొన్నారు. ఒకే దరఖాస్తుదారునికి టెండర్లు కేటాయించారని అన్నారు. రవాణాదారులకు టిఎఎస్‌ఎంఎసి ఏడాదికి రూ.100 కోట్లకు పైగా చెల్లించిందని ఆప్రకటనలో తెలిపింది. టిఎఎస్‌ఎంఎసి రాష్ట్రంలో మద్యం వ్యాపారంపై గుత్తాధిపత్యం కలిగిన ఉన్న ప్రభుత్వం సంస్థ.

# నేడు సాయుధ బలగాలకు మద్దతుగా తిరంగా ర్యాలీ

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

భారత సాయుధ బలగాలకు, ప్రధాని నరేంద్ర మోడీ తిరుగులేని నాయకత్వానికి గౌరవ సూచకంగా నేడు శనివారం జరిగే తిరంగా ర్యాలీలో మహేశ్వరం నియోజకవర్గం మీర్ పేట నుండి భారీ ఎత్తున జనం తరలిరావాలని మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన తిరంగా యాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ "ఆపరేషన్ సిందూర్" విజయవంతం అయిన నేపథ్యంలో మన సైనికులకు, ప్రధానమంత్రికి, మద్దతుగా జరిగే ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పౌర సమాజం పాల్గొని తమ అభినందనలు వెల్లడి చేయాలని మనం ప్రశాంతంగా జీవిస్తున్నాము అంటే బార్డర్ లో పనిచేసే సైనికులు అని మర్చిపోవద్దని, అందుకే జై జవాన్ జై కిసాన్ అన్నారని ఆయన పేర్కొన్నారు. శనివారం జరిగే ఈ కార్యక్రమం ట్యాంక్ బండ్ లోని అంబేద్కర్ విగ్రహం నుండి నక్లెస్ రోడ్డు వరకు కొనసాగుతుందని కావున పెద్ద ఎత్తున భరతమాత అభిమానులు పాల్గొని భారత జాతికి జేజేలు పలకాలని సైనికులకు అండదండలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మాజీ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, మీర్ పేట భారతీయ జనతా పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కోడూరు సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శి గాజుల మధు, మాజీ కార్పొరేటర్ ఏ భీమరాజు, సూల ప్రభాకర్, గోపీనాథ్, తుమ్మల రమేష్, సిద్దాల శ్రీనివాస్, మల్లికార్జున్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ ఆదర్శం ఈ చదువుల తల్లి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



మేడ్చల్ మల్కాజిగిరికి చెందిన "మాతృ అభయ" అనాధ విద్యార్థి గృహంలో ఉంటూ నర్సింగ్ మూడో సంవత్సరంలో 695 మార్కులతో జి పుష్ప రాణి అందరికీ ఆదర్శంగా నిలిచిందని మాతృ అభయ అనాధ విద్యార్థి గృహం ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం నాడు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ టి. జి. ఎస్. ఆర్.టి.సి. తార్నాక లో అనుబంధంగా ఉన్న కాళోజి నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నుండి నర్సింగ్ మూడో సంవత్సరం పూర్తి చేసింది. 700 మార్కులకు గాను ఆమె 695 మార్కులు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించింది. మొదటి రెండో సంవత్సరంలో కూడా అత్యున్నత ప్రతిభ కనబరిచిన పుష్పారాణి ఈ స్థానంలో నిలబడడానికి తమ వసతి గృహానికి మద్దతు పలికిన వారికి అభినందనలు తెలియజేస్తుందని ఆ ప్రకటనలో తెలిపింది.

# ఈ నెల 18న సంగీత విభావరి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి:**

ఈనెల 18వ తేదీ ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి రాత్రి 9 గంటల వరకు 8 గంటల పాటు రిషి మ్యూజికల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో త్యాగరాయ గణ సభ ప్రధాన వేదికలో 21వ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు రిషి మ్యూజికల్ ఈవెంట్స్ అధినేత అక్కిరాజు యోగిత తెలిపారు. శుక్రవారం నాడు పత్రికలకు ప్రకటన విడుదల చేస్తూ ఈ సంగీత విభావరిలో పద్మ సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతిని పురస్కరించుకొని సిరివెన్నెల 80 సినీ గేయాలను 27 మంది ఔత్సాహిక గాయనీ గాయకులు తమ గళాలతో స్వరార్చన చెయ్యనున్నారని ఇట్టి సంగీత విభావరిలో అధిక సంఖ్యలో సిరివెన్నెల అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యోగితా కోరారు.


# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

శనివారం వేసవి యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మైంటైనెన్స్ వర్క్ నిర్వహిస్తున్న నేపథ్యంలో లెనిన్ నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్తుకు అంతరాయం ఉంటుందని ఏఈ నేడొక ప్రకటనలో తెలిపారు. కె.వి 11 జనప్రియ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుండి 5 గంటల వరకు ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ, అయోధ్య నగర్ (పాత కొత్త ), జనప్రియ మహానగర్ ఆల్ బ్లాక్స్ లో విద్యుత్తు ఉండదని బడంగ్ పేట ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు హుడా కాలనీ, లెనిన్ నగర్ డబుల్ బెడ్రూమ్స్, రైతు బజార్, గందా రెడ్డి కాలనీ, భీష్మ నగర్, సాయి నగర్ గోకుల్ నివాస్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని 11 కేవీ సీఎంఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం తొమ్మిది గంటల 30 నిమిషాల నుండి రామిడి హిల్స్, విశాఖ నగర్, సి.ఎం.ఆర్ కాలనీ, సి వై ఆర్ కాలనీ, ఎస్ ఎస్ రెడ్డి కాలనీ, వైయస్సార్ నగర్,రాజీవ్ గృహకల్ప,శ్రీ మారుతీ నగర్, విశాఖ విహార్స్,ప్తగిరి కాలనీ, చంద్ర విహార్ కాలనీ, మారుతీ నగర్, ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని 11 కేవీ ప్రశాంతి హిల్స్ పరిధిలో సౌభాగ్య లక్ష్మీ నగర్, షిరిడి నగర్, శేషాద్రి నగర్,కాకతీయ కాలనీ రెడ్డి కాలనీ, సాయి బాలాజీ టౌన్షిప్, సీతా హెూమ్స్ ఫేస్ 3 నారాయణ ఎంక్లేవ్, తిరుమల నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుండి ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంత రాయం ఉంటుందని తెలిపారు.

# ఆర్టీసీ డ్రైవర్లకు మజ్జిగ, తెల్ల రుమాళ్ల పంపిణీ

**వేద న్యూస్, గీసుకొండ :**



గీసుకొండ మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ 75వ జన్మదినం సందర్భంగా గీసుకొండ సోషల్ సర్వీస్ టీం, స్థానిక గీతా లక్ష్మీనారాయణ మహిళా పరపతి సంఘం ఆధ్వర్యంలో కొనాయమాకుల బస్‌స్టాండ్‌లో ప్రయాణీకులు ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నర్సంపేట బస్ డిపో ఎంఎఫ్ ప్రభాకర్, ఏఈ నరేందర్ గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సరస్వతీ పుష్కరాల సందర్భంగా మండుటెండల్లో విధులు నిర్వహించనున్న బస్ డ్రైవర్లు, కండక్టర్లకు 100మందికి తెల్ల రుమాళ్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గీసుకొండ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి, మాజీ చైర్మన్ రామా కుమారస్వామి, ఆర్టీసీ ఉద్యోగి వంగల రాంబాబు,గీసుకొండ సోషల్ సర్వీస్ టీం సభ్యులు కర్ణకంటి రాంమూర్తి, ముల్క సత్యనారాయణ, మహ్మద్ సోనీ,యాదగిరి కుమారస్వామి, పసుల సంపత్, వటుకుల రవికుమార్, కర్ణకంటి రజిత, కత్తి హేమలత, కక్కెర్ల సుజాత, వీరగొని హేమలత,పసుల సునిత తదితరులు పాల్గొన్నారు.

# ఇంతింతై వటుడింతై..

**మొదటి పేజీ తరువాయి**

వెళ్లినపుడు పూర్వ పార్టీని విమర్శించకుండా.. తాను ఆ పార్టీని, ఆ పార్టీ నాయకుడిని గౌర విస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పీసీసీ చీఫ్‌గా నియమితుడై, ఎన్నికల బరిలో నిలిచి కాంగ్రెస్ పార్టీని గెలిపించి.. తెలంగాణ రెండో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణం చేశారు. ఒకనాడు చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఆయన వద్ద నాయకుడిగా ఉన్న రేవంత్.. ప్రస్తుతం పక్క రాష్ట్ర సీఎంగా, తన రాజకీయ గురువు చంద్రబాబుతో సమానంగా ముందుకుసాగే ప్రయత్నం చేస్తున్నారు.

## సీనియర్ పొలిటీషియన్ చంద్రబాబు



శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్ లీడర్‌గా పొలిటికల్ యాక్టివిటీస్ చేపట్టిన చంద్రబాబు.. తన రాజకీయ జీవితాన్ని కాంగ్రెస్ పార్టీతో ప్రారంభించారు. సంజయ్ గాంధీ మద్దతుదారుగా, యూత్ కాంగ్రెస్ నేతగా ఎన్జీ రంగా సాయంతో ఎమ్మెల్యే టికెట్ సంపాదించి చంద్రగిరి నియోజకవర్గం నుంచి 28 ఏండ్లకే ఎమ్మెల్యే అయి..టి.అంజయ్య మంత్రివర్గంలో 30 ఏండ్లకే మినిస్టర్ అయ్యారు. ఈ క్రమంలోనే సినిమాటోగ్రఫీశాఖ మంత్రిగా ఎన్టీఆర్‌తో పరిచయం, సంబంధాలు కలిగి ఉండటంతో ఆయన కూతురు భువనేశ్వరిని వివాహం చేసుకున్నారు. అనంతరం ఎన్టీఆర్ 1983లో తెలుగుదేశం పార్టీని స్థాపించగా, ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున చంద్రగిరి నుంచి పోటీ చేసిన చంద్రబాబు.. గల్లా అరుణకుమారి చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత టీడీపీలో చేరిన చంద్రబాబు.. ఎన్టీఆర్ అల్లుడిగా, టీడీపీ నాయకుడిగా మారి..పార్టీలో కీలకంగా మారారు. 1984 ఆగస్టు సంక్షోభంలో ఎన్టీఆర్‌ను తిరిగి సీఎం చేయడంలో తన వంతు పాత్రను కీలకంగా పోషించిన చంద్రబాబు.. 1995లో మాత్రం ఎన్టీఆర్ వ్యతిరేక శిబిరంలో టీడీపీ ఎమ్మెల్యేల సపోర్టుతో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ఉమ్మడి ఏపీకి అత్యధిక కాలం పని చేసిన సీఎంగా రికార్డు సృష్టించిన చంద్రబాబు.. విభజిత ఏపీ తొలి, ప్రస్తుత సీఎంగా ఉన్నారు. ప్రధాని నరేంద్రమోడీ కన్న కూడా దేశంలోనే సీనియర్ పొలిటీషియన్‌గా చంద్రబాబు ఉన్నారు.

## ఏక్‌నాథ్ షిండే



ప్రస్తుతం మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న ఏక్‌నాథ్ షిండే హార్డ్ కోర్ మరాఠావాద శివసేన లీడర్. పాలిటిక్స్‌లోకి రాక మునుపు తన కుటుంబ ఆర్థిక పోషణ నిమిత్తం ఆటో రిక్షా నడిపారు. శివసేన పార్టీ థానే జిల్లా అధ్యక్షుడు ఆనంద్ డిఘే(ధర్మవీర్).. ఏక్‌నాథ్ షిండేను రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. బాలసాహెబ్ థాక్రే వీరాభిమానిగా, శివసేన సైనికుడిగా పార్టీలో ఆనంద్‌తో కలిసి షిండే పని చేయడం ప్రారంభించారు. ధర్మవీర్‌గా పేరు గాంచిన ఆనంద్ డిఘే రాజకీయ వారసుడిగా అనతికాలంలోనే షిండే ఎమర్జ్ అయ్యారు. 2001లో ఆనంద్ మరణానంతరం థానే జిల్లాలో శివసేన పార్టీలో, బయట పట్టు సంపాదించి డిస్ట్రిక్ట్‌లోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఏక్‌నాథ్ షిండే అంటే శివసేన సైనికుడు అనేలా పేరు సంపాదించుకున్నారు. థానే మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ స్థాయి వరకే ఆనంద్ ఎదగగా, ఆయన పొలిటికల్ సక్సెసర్‌గా వచ్చిన ఏక్‌నాథ్ మాత్రం ఎమ్మెల్యేనే కాకుండా మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా కొంత కాలం పని చేసి..సమర్థుడైన నాయకుడిగా పేరు సంపాదించుకుని.. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా సేవలు అందిస్తుండటం విశేషం.

## అజిత్‌పవార్



రాజకీయ కురువృద్ధుడు శరద్ పవార్ కుటుంబం నుంచి వచ్చి మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న వ్యక్తి అజిత్ పవార్. పెదనాన్న శరద్ పవర్ అడుగుజాడల్లో నడుస్తూ.. రాజకీయ అరంగేంట్రం చేసిన అజిత్.. పుణె డిస్ట్రిక్ట్ సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా 1991 నుంచి ఏకధాటిగా16 ఏండ్ల పాటు సేవలందించారు. బారామతి లోక్‌సభ సభ్యుడిగా వరుసగా ఐదుసార్లు ఎన్నికయి రికార్డు సృష్టించారు. సుధాకర్‌రావు నాయక్ నాయకత్వంలోని మంత్రివర్గంలో తొలిసారి మినిస్టర్‌గా వర్క్ చేసిన అజిత్ పవార్.. తర్వాత కాలంలో రాజకీయాల్లో క్రమంగా ఆరితేరారు. సంకీర్ణ రాజకీయాల్లో నంబర్ గేమ్, మ్యాజిక్ ఫిగర్ విషయాల్లో పట్టు సంపాదించారు. రాజకీయంగానూ సమీకరణాలపైన దృష్టి సారించారు. కాంగ్రెస్ పార్టీతో రాజకీయ జీవితాన్ని ప్రారంభించి అజిత్.. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో కీలక లీడర్‌గా ఎదిగారు. అనంతర కాలంలో ఎన్సీపీపైన రెబల్‌గా మారి ప్రత్యర్థి వర్గంలోకి వెళ్లారు. ఎన్సీపీలో చీలిక వర్గాన్ని తీసుకొచ్చి..శరద్ పవార్ వర్గం కంటే కూడా ప్రజాక్షేత్రంలో బలం పెంచుకోగలిగారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అజిత్ పవార్ వర్గం శరద్ పవార్ వర్గం కంటే ఘన విజయం సాధించింది. అజిత్ మరోసారి డిప్యూటీ సీఎం అయ్యారు. ఇప్పటికీ అజిత్ పవార్ వర్గం శరద్ పవార్‌ను పెద్దాయనగా గురువుగా గౌవిస్తోంది.

## కేసీఆర్



యూత్ కాంగ్రెస్‌లో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన కేసీఆర్.. తర్వాత కాలంలో టీడీపీలో చేరి సిద్దిపేట నుంచి నాలుగు పర్యాయాలు శాసన సభ్యుడిగా సేవలందించారు. ఎన్టీరామారావు ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన కేసీఆర్.. టీడీపీలో కీలకంగానే పని చేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలోనూ ట్రాన్స్‌పోర్ట్ మినిస్టర్‌గా వర్క్ చేసిన కేసీఆర్.. టీడీపీ వ్యవస్థాపక అధినేత ఎన్టీఆర్, నాయకుడు చంద్రబాబులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. టీడీపీని రాజకీయంగా గౌరవించారు. అనంతర కాలంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సాగిన ఉద్యమంలో ఉద్యమనేతగా కేసీఆర్ తాను ఎదిగి వచ్చిన టీడీపీ, ఆ పార్టీ నేత చంద్రబాబును విలన్‌గా చూపిస్తూ.. రాజకీయం చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత పదేండ్ల పాటు సీఎంగా సేవలందించారు. ఈ సమయంలో టీడీపీని తెలంగాణలో భూస్థాపితం చేసేందుకు సాయశక్తులా పని చేశారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తుంటారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు.

## సిద్ధరామయ్య



లా గ్రాడ్యుయేట్ అయిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పొలిటికల్ ఎంట్రీ 1983లో అనూహ్యంగా జరిగింది. మైసూరు ప్రముఖ న్యాయవాది చిక్కబోరయ్య జూనియర్‌గా ఆయన ప్రాక్టీస్ చేసేవారు. ఆ సమయంలో నంజుండ స్వామి అనే న్యాయవాది సిద్ధరామయ్యను ఎన్నికల బరిలోకి దిగాలని కోరగా, చాముండేశ్వరి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి భారతీయ లోక్‌దళ్ పార్టీ తరఫున పోటీ చేసి తొలిసారిగా విజయం సాధించారు. అనంతరం రామకృష్ణ హెగ్డే ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. తర్వాత జనతాదళ్ పార్టీలో చేరి సెక్రెటరీ జనరల్‌గా వర్క్ చేస్తుండగా, హెచ్.డీ.దేవెగౌడ అదే పార్టీలో చేరారు. దేవెగౌడ నాయకత్వంలోని ప్రభుత్వంలో సిద్ధరామయ్య ఆర్థిక మంత్రిగా సేవలందించారు. అలా హెచ్.డీ.దేవెగౌడకు శిష్యుడిగా రాజకీయాల్లో రాణించారు. అనంతర రాజకీయ పరిణామాల్లో జనతా దళ్(సెక్యులర్) పార్టీని దేవెగౌడ స్థాపించగా, ఆ జేడీ(ఎస్) పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా సిద్ధరామయ్య పనిచేశారు. కానీ, తర్వాత ఏర్పడిన రాజకీయ విభేదాల వల్ల సిద్ధరామయ్యను పార్టీ నుంచి దేవెగౌడ సస్పెండ్ చేశారు. దాంతో కాంగ్రెస్ పార్టీలో చేరిన సిద్ధరామయ్య.. దేవెగౌడ పార్టీ జేడీ(ఎస్)ను ప్రజాక్షేత్రంలో ఎదుర్కొని విజయం సాధించారు. కర్ణాటక ముఖ్యమంత్రి పీఠాన్ని సైతం అధిరోహించారు.

## మమతాబెనర్జీ



దేశంలో ప్రతిపక్షంలో ఉన్న ఏకైక మహిళా సీఎం, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర తొలి మహిళా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ. కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన మమత.. అంచెలంచెలుగా రాజకీయ నాయకురాలిగా ఎదిగారు. కాంగ్రెస్, సీపీఎంతో పాటు బీజేపీలకు వ్యతిరేకంగా మమత తన రాజకీయాన్ని కొనసాగించారు. దేశంలో అంతటా విస్తరించిన బీజేపీకి పశ్చిమ బెంగాల్‌లో మాత్రం కొరకరాని కొయ్యగా ఆమె నాయకత్వంలో టీఎంసీ(తృణమూల్ కాంగ్రెస్ పార్టీ) నిలుస్తోంది. పీవీ నరసింహరావు, వాజపేయిల మంత్రివర్గంలో కేంద్ర మంత్రిగా పని చేసిన అనుభవమున్న మమతాబెనర్జీ..పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలంగా 2016 నుంచి సేవలందిస్తున్నారు.

# ప్రభుత్వం ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది..!

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




మిర్యాలగూడ నియోజకవర్గ భారత జాతీయ మహిళా సమాఖ్య వర్గ మహాసభను పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చినటువంటి అన్ని హామీలను భేషరతుగా అమలు చేయాలని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువుల సరుకుల ధరలు అదుపు చేయడంలో విఫలమైందని అన్నారు. నేటికీ భారతదేశంలో మహిళల మీద అగత్యాలు జరుగుతున్నా కూడా కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తుంది తప్ప అరికట్టాలని ఆలోచన చేయకపోవడం చాలా విడ్డూరం అని మండిపడ్డారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల పేరుతో సుందరాంగులందరిని పిలిపించి తెలంగాణ వంటకాలు, తెలంగాణలో ఉన్నటువంటి,పుణ్యక్షేత్రాలను, తెలంగాణ కట్టు బొట్టు సాంప్రదాయాలను చూపించటం చాలా మంచిదే కానీ తెలంగాణ ఆడపడుచుల మనోభావాలు దెబ్బతినే విధంగా వరంగల్‌లో తెలంగాణ ఆడపడుచులచే సుందరాంగులకు కాళ్లు కడిగియడం తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతినేవిదంగా ఉందని వారు విచారం వ్యక్తం చేశారు. ఈ మహాసభ లో సభాఅధ్యక్షులుగా దాసర్ల దుర్గమ్మ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య నాయకురాలు ఎర్ర బోతు పద్మ, ఎస్కే షమీం,శాంతి,సిపిఐ మండల కార్యదర్శి లు ఎండి సయ్యద్,దిరావత్ లింగ నాయక్, జిల్లా యాదగిరి,పోలేపల్లి ఉదయ్,ఎర్ర ప్రమీల,పోలేపల్లి మమత,లింగంపల్లి సైదమ్మ, కోటమ్మ, మచ్చ శైలజ, సైదమ్మ,రజియా,సుశీల,సీత,ఎస్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




మిర్యాలగూడ మండలం జప్తివీరప్ప గూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారి ఆధ్వర్యంలో ఒక వినూత్న కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రైతుల కోసం నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే ఈ వినూత్న కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామంలోని రైతులతో కలిసి మాట్లాడుతూ అధిక దిగుబడులు రావడానికి ఎలాంటి విత్తనాలు వాడాలి, ఎలాంటి ఎరువులు వాడాలి అని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి రావడానికి కలానికి అనుగుణంగా పంటలను మార్చడంతో పాటు పంట దిగుబడులు పెరిగే విత్తనాలు ఉపయోగించాలని,దానికి కావలసిన సలహాలు సూచనలు ఇవ్వడానికి వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ గ్రామాలను సందర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరమని ఆయన అన్నారు. ఫెస్టిసైడ్స్ ఎరువులు వాడకాలను తగ్గిస్తూ,సేంద్రీయ ఎరువులు వాడకాలను పెంచాలని రైతులను కోరారు. అలాగే ప్రభుత్వం కూడా విత్తనాలపై సబ్సిడి అందిస్తుందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని నాణ్యమైన పంటలను సాగు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖఅధికారులు,రైతులు,గ్రామస్థులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# భూమి అమ్మకుండా ఆదేశాలు

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడలోని ఎఫ్సీఐ హమాలీ కార్మిక సంఘం గతంలో కొనుగోలు చేసిన భూమిని జిల్లా సహకార శాఖ అనుమతి లేకుండా అమ్మ రాదని జిల్లా సహకార శాఖ అధికారి పత్యానాయక్ ఆదేశాలు జారీ చేసినట్లు ఐఎన్ టీయుసి హమాలీ కార్మిక సంఘ అధ్యక్షుడు ధనావత్ చిన్నపాండు తెలిపారు. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం ఇండస్ట్రియల్ కాలనీ సమీపంలోని కార్మిక సంఘం భూమిని శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గతంలో కొనుగోలు చేసిన భూమిని కార్మిక సంఘ సభ్యులు అనుమతి లేకుండా అమ్మకాలు జరిపినట్లు తాను ఈ ఏడాది మార్చిలో జిల్లా కలెక్టర్ కు,జిల్లా సహకార శాఖ అధికారికి ఫిర్యాదు చేశానన్నారు. తన ఫిర్యాదుతో విచారణ చేపట్టిన అధికారులు భవిష్యత్తులో భూములు అమ్మేందుకు కార్మిక సంఘానికి అవకాశం లేకుండా ఆదేశాలు ఇచ్చారన్నారు. హమాలీ కార్మిక సంఘం భూములను ఇక మీదట ఎవరికీ కొనుగోలు చేసే అవకాశం లేదని వారు తెలిపారు. గతంలో ఏకపక్షంగా జరిపిన అమ్మకాల విషయమై తాను మిర్యాలగూడ గ్రామీణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసిన విషయం ఆయన గుర్తు చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఎఫ్సిఐ హమాలీ కార్మిక సంఘం భూముల అమ్మకాల విషయం సమగ్ర విచారణ జరిపి కార్మికులందరికీ న్యాయం చేయాలని కోరారు. శంకర్ మాలోతి,శంకర్ తులసిరామ్,చీనా లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073